

# పసిడిమనసులు - షర్మిల



## లచ్చిందేవమ్మ

**మా ఊళ్లో** ఏది కావాలన్నా మైలు దూరాన వున్న కూచిపూడి సెంటర్ కి ఎళ్లాల్సిందే.

కనీసం కోమటి కొట్టన్నా లేని ఊరు మేం చూసెరగమమ్మా అంటారు చాలా మంద .

మా బార్లపూడి ప్రత్యేకతల్లో అదొకటి.

దాన్ని బార్లపూడి అనే బదులు బుల్లి ఊరు అంటే సరిపోయేది.

మహా అయితే ఏభై ఇళ్లు వుంటాయేమో!

మా అమ్మ ఎప్పుడూ అనేది మీ ఊరు ఉల్లిపాయంతే గానీ తగాదాలు తాటికాయంత అని. ఊరన్నాకా ఆమాత్రం తగాదాలన్నా లేకపోతే ఏం బాగుంటంది.

మరి మా ఊరాళ్ల ధాటికి తట్టుకోలేకో వ్యాపారం గిట్టకో ఒక కొట్టు కూడా లేదు.

అసలు మా ఊరి జనాలకి సాయంత్రపేళకి కూచిపూడి సెంటర్ కి ఒక చేతి సంచి సైకిల్ హేండిల్ కి తగిలించుకుని షికారెల్లి రాకపోతే తోచదు . ఉప్పయినా పప్పయినా కూచిపూడి పరిగెత్తాల్సిందే.

అట్టాంటి మా ఊళ్లో లచ్చిందేవమ్మ దగ్గర మాత్రం జీడీలు, సిగిరెట్లు, బిళ్లలు ఇట్టాంటి సరుకులు దొరుకుతాయ్.

మా వూరొచ్చిన పట్నం అల్లుళ్ల సిగిరెట్లు అయిపోతే గుర్తొచ్చేది లచ్చిందేవమ్మే.

లచ్చిందేవమ్మ వుండే తాటాకు పాకలో ఒక పక్క ఈ సామాన్లు పెట్టి వుంచేది.

ఒక సంచిలో రెండు మూడు రోజులకోసారి కూచిపూడి ఎళ్లి సరుకులు తెచ్చుకుని ఇక్కడ అమ్మేది.

నీరుకావి రంగు చీర తెల్లజాకెట్టు వేసుకుని వుండే లచ్చిందేవమ్మ గట్టిగా మాట్లాడడం నేను ఎరగను.

ఆమె ఎక్కువ ఒంటరిగా వుండేది.

ఎప్పుడన్నా చిట్టెమ్మా కాసిని మజ్జిగుంటే పొయ్యి అంటా వచ్చి బియ్యం చెరిగి పెట్టో , పప్పులు బాగు చేసిపెట్టో ఎళ్లేది.

మా చంటి మావయ్య వచ్చినప్పుడు మాత్రం సిగిరెట్లకి పంపిస్తే తెచ్చేదాన్ని.

నాకు రంగు బిళ్లలు , జీడీలు కొనుక్కోవాలని ఎంత ఆశో. కానీ ఇంట్లో బయటవి కొనుక్కోకూడదని ఏం కావాలన్నా చేసి పెడతామంటారు.

మా తాత డ్రాయర్ సొరుగు నిడా చిల్లర డబ్బులేసి వుంచేవాళ్లు.

నేను ఆ రోజు ఎవరూ చూడకుండా  రూపాయి చిల్లర తీసుకుని లచ్చిందేవమ్మ దగ్గర అర్ధరూపాయి పెట్టి బిళ్లలు, మిగతా అర్ధ రూపాయి తో రంగు కళ్ల జోడు కొనుక్కున్నాను.

ఇంటికెళ్లాలటే భయం.

అందుకే చెరువు గట్టున కూర్చుని బిళ్లలు చప్పరిస్తూ రంగు కళ్లజోడు పెట్టుకుంటే " నా సామి రంగా !" మా ఊరంతా రంగు మారి భలేగా వుంది.

నా రంగు కళ్లజోడు మోజు తీరకముందే నన్నెవరు చూడకూడదో వాళ్లే చూసేశారు.

మా మన్నాన ( పెద్దనాన్న ) మా ఇంటికి వస్తా నన్ను చూసేశాడు.

రంగుకళ్లజోడు , రంగు బిళ్లలు తిని ఎఱ్రబడ్డ నోరు చూసి "అమ్మడూ ! బిళ్లలు ఎక్కడియ్యి ఎవరు కొనిపెట్టారు" అనడిగాడు.

అబద్ధం చెప్పే అలవాటు లేక నిజం చెప్పలేక బిక్క మొహం వేసుకున్నాను.

ఇంటికి తీసుకెళ్లి అడగగానే టేబుల్ సొరుగులో డబ్బులు తీసుకుని కొనుక్కున్న సంగతి చెప్పేశాను.

ఇకచూస్కోండీ మా మన్నాన ఒక కొబ్బరి ఆకు తీసుకుని నాకు రెండు తగలనిచ్చాడు.

కొడుతుంటే " అమ్మో ! నాయనో !! అంటా ఇంటి చుట్టూ పరిగెత్తాను.

నా ఏడుపు విన్న చిట్టెమ్మ బయటకొచ్చి కొబ్బరాకుతో కొడుతున్న మన్నానని, గోల గోలగా ఏడుస్తున్న నన్ను చూసి చెంగు అడ్డు పెట్టుకుని ఒకటే నవ్వు.

" పిన్నీ ! ఇది డ్రాయర్ లో డబ్బులు తీసింది, అసల దీన్ని కాదు ... ఇట్టాంటియన్నీ తీసుకొచ్చి అమ్ముతాందే దాన్ని అనాలి" అని లచ్చిందేవమ్మ మీద అగ్గి మీద గుగ్గిలమయ్యాడు.

లచ్చిందేవమ్మ అప్పటికీ  పాపం నాకు బిళ్లలు ఇస్తా అననే అంది " అమ్మో మీ ఇంట్లో ఈ బిళ్లలు తింటే వూరుకోరమ్మా"  అన్నా నేనే వినలా.

లచ్చిందేవమ్మ బతికి వున్నన్నాళ్లు మా వూళ్లో బిళ్లలు, సిగిరెట్లన్నా దొరికేయి.

ఇప్పుడు కొత్త అల్లుళ్ల కి సిగిరెట్లు కావాలన్నా కూచిపూడి సెంటర్ కి పరిగెత్తాల్సిందే.

దేశం మారిపోయినా , ఇన్నేళ్లయినా  మా ఊరికో కొట్టు మాత్రం రాలేదు.

ఆ విధంగా లచ్చిందేవమ్మ మా ఊరి చరిత్రలో నిలిచిపోయింది.

*(వచ్చేనెల మరో కథ)*

Click here to share your comments